## అతిథి అధ్యాపకుల పోస్టులకు ఆహ్వానం

పాలమూరు, అక్టోబర్ 6 : స్థానిక ఎంవీఎస్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వృక్షశాస్త్రం, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఆంగ్లం, గణితం, తెలుగు సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 50శాతం మార్కులు కలిగి ఉండాలని అన్నారు. సోమవారం వరకు బయోడేటా, రెజ్యూమ్, అర్హత సర్టిఫికెట్లను కళాశాలలో అందజేయాలని సూచించారు. అభ్యర్థులకు 10వ తేదీన ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

## 12న వాలీబాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 6 : జిల్లాలోని రాజాపూర్ హైస్కూల్‌లో 12వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–17 బాలబాలికల వాలీబాల్ టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు విద్యార్థులు బోనఫైడ్, ఆధార్‌కార్డుతో రిపోర్టు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా జట్లు పాల్గొనాలని, మరింత సమాచారం కోసం 9440705495 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## 8న సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 6 : ఆర్మూర్‌లో ఈనెల 15, 16న రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళలు, మెదక్‌లో 17నుంచి 19వ తేదీ వరకు సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన జిల్లా జట్లకు ఎంపికలు ఆదివారం స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు నాగరాజు, రాఘవేందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ సర్టిఫికెట్లతో మధ్యాహ్నం 2గంటలకు కోచ్ సాధిక్ అలీకి రిపోర్టు చేయాలని కోరారు. మరింత సమాచారం కోసం 8897378248 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## 8న రగ్బీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 6 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్–17, 19 రగ్బీ బాలబాలికల జట్ల ఎంపికను ఆదివారం నిర్వహిస్తున్నట్లు అండర్–19 సెక్రటరీ పాపిరెడ్డి, అండర్–14 సెక్రటరీ రమేశ్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో ఎంపికలు ఉంటాయని, విద్యార్థులు బోనఫైడ్, టెన్త్ మెమో, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు. అండర్–17 విభాగంలో 1-1-2007, అండర్–19 విభాగంలో 1-1-2005 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. మరింత సమాచారానికి అండర్–17 కోసం 9441565282, అండర్–19 కోసం 7989973926 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## కొండచిలువ పట్టివేత

పెద్దమండడి, అక్టోబర్ 6 : మండలంలోని అమ్మపల్లి శివారులో ఉన్న సోలార్ పవర్ స్టేషన్లో రైతులు శుక్రవారం కొండచిలువను గుర్తించారు. విషయాన్ని రైతు చిన్న ఉషన్న పవర్ స్టేషన్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ సత్యనారాయణకు చెప్పగా అతడు హోంగార్డు, సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారమిచ్చాడు. ఆయన పవర్ స్టేషన్ వద్దకు చేరుకొని రాక్ పైతాన్(కొండచిలువను)ను చాకచక్యంగా బంధించి మాట్లాడారు. మండలంలో నాలుగేండ్లుగా చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీళ్లు ఉండడంతో కొండచిలువలు, మొసలిలు సంచరిస్తున్నాయన్నారు. రైతులు ఆందోళన చెందకుండా వెంటనే తమకు సమాచారం ఇస్తే వాటిని బంధించి సురక్షిత ప్రాంతాల్లో వదిలేస్తామన్నారు. కార్యక్రమంలో అమ్మపల్లి యువకులు, సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు గోపాల్, బాలకృష్ణ, రఘు, శ్రీను, రాజేశ్, విష్ణు, నరేశ్ పాల్గొన్నారు

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 6 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన మండలంలోని చెన్నపురావుపల్లిలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన పంగిడి చెరువు జాముడు(55) మూడు రోజుల కిందట కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం గ్రామ శివారులోని పొదల్లో అనుమానాస్పద స్థితిలో అతడి మృతదేహం లభించింది. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. జాముడి మృతిపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన భార్యాభర్తలు



భానుప్రకాశ్, స్వాతి

కొత్తకోట, అక్టోబర్ 6 : కొత్తకోట పట్టణానికి చెందిన భార్యాభర్తలు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. పట్టణంలోని తిరుపతయ్య, సువర్ణ దంపతుల మొదటి కుమారుడు భానుప్రకాశ్ ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాగా అతడి భార్య స్వాతి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. భానుప్రకాశ్ హైదరాబాద్‌లోని పరివస్తు క్రియేటివ్ ఫౌండేషన్‌లో శిక్షణ తీసుకుని రాష్ట్రస్థాయిలో 155 మార్కులతో మొదటిస్థానం సాధించాడు. భార్యాభర్తలకు ఉద్యోగాలు రావడంతో బంధుమిత్రులు, కుటుంబసభ్యులు వారిని అభినందించారు.

# ఆదర్శం..

- సేంద్రియ వ్యవసాయంలో మహిళా రైతు మెళకువలు
- సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో పట్నం వదిలి పల్లెకు పయనం..
- 2010 నుంచి సేంద్రియ ఎరువులతోనే సాగు

- రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న ఊర్మిళమ్మ



వరి చేనులో ఊర్మిళమ్మ

అచ్చంపేటరూరల్, అక్టోబర్ 6 : మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన మహిళా రైతు చెన్నారం ఊర్మిళమ్మ సేంద్రియ వ్యవసాయంతో పంటలు సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది. సుభాష్‌పాలేకర్ స్ఫూర్తితో పట్నం నుంచి స్వగ్రామానికి చేరుకున్న ఆమె తనకున్న 40ఎకరాల్లో మొదటగా 25 ఎకరాల్లో సేంద్రియ పద్ధతులతో పంటలు సాగు చేసింది. వరి, మిరప, కంది, జొన్న, మామిడి, పత్తి ఇతర పంటలను సాగు చేస్తూ మండలంలో ఎందరో రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. 20కి పైగా ఆవులతో గోశాలను నిర్వహిస్తూ పేడ, మూత్రంతోపాటు వాయిలు ఆకులు, వేప ఆకులు, దేవదారి ఆకులతో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. ఐదో తరగతి వరకే చదివినా లోక జ్ఞానం నుంచే వ్యవసాయంలో మంచి పట్టును సంపాదించారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు ఎంత చెప్పినా రసాయన మందులు వాడి పంటల దిగుబడి సాధించేందుకు అపసోపాలు పడుతున్నారు. కానీ ఊర్మిళమ్మ మాత్రం సేంద్రియ ఎరువులతోనే సాగు చేసి లాభాలు పొందవచ్చని నిరూపించారు. అచ్చంపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన ఊర్మిళమ్మ, పెంటారెడ్డి దంపతులు మండలంలోని పలువురు రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో మెళకువలు నేర్పుతూ రాణిస్తున్నారు. గతంలో కొడుకు ఉద్యోగ రీత్యా విదేశాల్లో ఉండడంతో వారితోపాటు అక్కడే కొన్ని రోజులు ఉన్నారు. సేంద్రియ వ్యవసాయ రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న సుభాష్ పాలేకర్ ఆలోచన విధానం నచ్చి వీడియోలు చూస్తూ ఆయన్ని కలుసుకొని తమ స్వగ్రామం చేరుకొని తమకు ఉన్న 40 ఎకరాల్లో మొదట 25 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో మొదట మామిడి తోట అందులో అంతర్ పంటగా వేరుశనగ 10 ఎకరాలు, మిరప 5ఎకరాలు, జొన్న 5 ఎకరాలు, వరి 5 ఎకరాల్లో సాగు చేసినా ఎలాంటి రసాయన ఎరువులను వాడకుండా కేవలం 20 పశువుల గోమూత్రం, ఎరువుగా పేడ, వేప, వాయిల్ల ఆకుల కాషాయాలను పెద్ద డ్రమ్ముల్లో 20రోజుల దాకా నిల్వ ఉంచి జీవామృతం తయారు చేసి పంటలకు తెగుళ్లు పోవడానికి పిచికారీ చేయడంతో తెగుళ్లను నివారించారు. గోవు మూత్రంతో వేరుశనగకు సోకిన తెగుళ్లను కూడా నివారించవచ్చని ఆమె నిరూపించారు.

### కషాయాలతో పంటల సాగు..

దశపర్ని, పేరిట జిల్లేడు, మారేడు, వాగిలి, గన్నేరు, ఉమ్మెత్త, తులసి, సీతాఫలం, జామ, నిమ్మ వంటి ఆకులతో కషాయాలను తయారు చేస్తోంది. ఇలా తయారు చేసిన వాటిని పురుగుల మందులకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పత్తి పంటకు మజ్జిగ పిచికారీ ఉపయోగకరంగా ఉంటుందని ఆమె చెబుతున్నారు. జొన్న, కందులు, మిరప, వేరుశనగ అంతర్‌పంటగా సాగు చేస్తున్నామన్నారు. వరిలో చిట్టి ముత్యాలు, బాస్మతి, బీపీటీ రకాలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తుండడంతో తమ అవసరాలకు మిగులు బంధుమిత్రులు తెలిసిన వారికి ఆర్డర్‌పై విక్రయిస్తున్నారు. ముఖ్యం గా మధుమేహం, అనారోగ్య సమస్యలు ఉన్న వారు సేంద్రియ సేద్యంతో సాగు చేసిన వరి, మిరప, కందులు, జొన్న లు, మామిడి ఇతర పంటలను కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు.

### నాడు సేంద్రియం దండగ అన్నారు..

మంచి పేరు మోసిన కంపెనీలు తయారు చేస్తున్న రసాయన ఎరువులతోనే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధ్యమని సేంద్రియ వ్యవసాయ ఎందుకు దండగ అని ఎగతాళి చేశారు. కానీ నేడు అందరూ కూడా సేంద్రియ విధానంతో సాగు చేసిన పంటలను ఎక్కువగా తీసుకునేందుకు ఇష్టపడుతున్నారు. ఎందుకంటే దీనికి సాగు ఖర్చు తక్కువ కావడంతోపాటు ఇది ఆరోగ్యానికి కూడా మంచిదని పలువురు వైద్యులు సూచిస్తుండడంతో చాలా మంది మాకు సేంద్రియ ఎరువులతో పండించిన ధాన్యం కావాలిని కోరుతున్నారు. అందుకే అందరూ సేంద్రియ వ్యవసాయంతో పంటలు సాగు చేసి తమ ఆరోగ్యాల్ని కాపాడుకోవాలి.

–ఊర్మిళమ్మ, చెన్నారం, అచ్చంపేట మండలం

# కొంపముంచిన వివాహేతర సంబంధం

మరికల్, అక్టోబర్ 6 : వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్య ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్న మరికల్ పోలీసులు మూడు రోజుల్లో ఛేదించారు. సీఐ రాజేందర్‌నాయక్, ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు..దేవర్కద్ర మండలం గురకొండ గ్రామానికి చెందిన గడుగు శ్రీనివాసులు(30)కు మక్తల్ మండలం దాసరిదొడ్డికి చెందిన మాధవి అలియాస్ హారతితో నాలుగేండ్ల కిందట వివాహం జరిగింది. కాగా వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. మాధవి దాసరిదొడ్డిలో ఉండడంతో శ్రీనివాసులు ఈనెల 1న ఇంట్లో వాళ్లకు చెప్పి గురకొండ నుంచి దాసరిదొడ్డికి వెళ్లాడు. అయితే భర్త తన వద్దకు రాలేదని మాధవి చెప్పడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా శ్రీనివాసులు మరికల్‌లో ఉన్నట్లు చెప్పాడు. రెండురోజుల తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మాధవిని విచారించగా తన వద్దకు రాలేదని చెప్పడంతో ఈనెల 2న కుటుంబసభ్యుడు అశోక్‌కుమార్ మరికల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి కుటుంబ సభ్యులను పిలిచి ఆరా తీశారు. దీంతో గ్రామానికి చెందిన యామన్నపై అనుమానం ఉందని, గతంలో వివాహేతర సంబంధంపై పలుమార్లు హెచ్చరించినా అతడితోపాటు మాధవిలో మార్పు రాలేదని తెలిపారు. దీంతో యామన్నను పోలీసులు శుక్రవారం తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ, ఎస్సై వెల్లడించారు. మాధవి, యామన్నతో కలిసి తన భర్త శ్రీనివాసులు అడ్డు తొలగించుకోవాలని, ప్లాన్ ప్రకారం హత్య చేసినట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం దేవసూర్ గ్రామ సమీపంలోని కృష్ణానది వద్ద ముళ్లపొదల్లో ఉన్న కుల్లిన స్థితిలో ఉన్న శ్రీనివాసులు మృతదేహాన్ని శుక్రవారం నారాయణపేట దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చినట్లు వారు పేర్కొన్నారు. మూడు రోజుల్లోనే కేసును ఛేదించిన మరికల్ పోలీసులను ఎస్పీ అభినందించారు.

# వ్యక్తి ఆత్మహత్య కేసులో ముగ్గురికి ఐదేండ్ల జైలు

- తీర్పు వెల్లడించిన న్యాయమూర్తి ప్రభాకర్

గద్వాల అర్బన్, అక్టోబర్ 6 : ఒక వ్యక్తిని మోసం చేసి ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన కేసులో ముగ్గురికి ఐదేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. పూర్తి వివరాలిలా.. వడ్డేపల్లి మండలం కోయిల్‌దిన్నె గ్రామానికి చెందిన కుర్వ చిన్న రంగస్వామి శాంతినగర్‌లో ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. కాగా శాంతినగర్‌లో నివాసం ఉంటున్న కార్తీక్, కృష్ణవేణి, భాస్కర్ కలిసి రంగస్వామికి మోసపూరిత మాటలు చెప్పి రూ.లక్ష ఇస్తే రూ.2లక్షలు ఇస్తామని నమ్మబలికి దాదాపు రూ.15లక్షలు తీసుకున్నారు. కొన్ని రోజుల తరువాత రంగస్వామికి వ్యాపారంలో నష్టం రావడంతో తన డబ్బులు చెల్లించాలని వారిని కోరాడు. దీంతో వారు డబ్బులివ్వమని, అవమానించి దిక్కున్న చోట చెప్పుకో.. లేకుంటే చావు అంటూ సమాధానమిచ్చారు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక, వారు అవమానించడంతో మనస్తాపానికి గురై 2018 ఏప్రిల్ 18న ఫర్టిలైజర్ దుకాణంలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా రంగస్వామి కుటుంబసభ్యులు అతడి చావుకు కారణమైన వ్యక్తులపై 2018 ఏప్రిల్ 19న శాంతినగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై మహేందర్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. శుక్రవారం ఇరువురి వాదనల అనంతరం న్యాయమూర్తి నిందితులకు ఐదేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేందుకు సహకరించిన పీపీ వెంకట్రాములు, యుగేందర్, ఎస్సై మహేందర్, నరేశ్, కానిస్టేబుల్ లక్ష్మణ్, గౌస్ తదితరులను ఎస్పీ సృజన అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇటిక్యాల, అక్టోబర్ 6 : ఓల్వో బస్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందగా పలువురికి గాయాలైన ఘటన జాతీయ రహదారి మునుగాల శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఇటిక్యాల ఎస్సై అశోక్‌బాబు కథనం మేరకు.. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం గోర్లగుట్టపల్లికి చెందిన గిడ్డయ్య అదే గ్రామానికి చెందిన వెంగన్నతో కలిసి ట్రాక్టర్‌లో బండల లోడ్‌తో గద్వాల వైపు వస్తున్నాడు. 44వ జాతీయ రహదారిపై మునుగాల శివారులో వెళ్తున్న ట్రాక్టర్‌ను కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓల్వో బస్ వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో గిడ్డయ్య తలకు తీవ్రగాయాలు కాగా బస్ కండక్టర్‌తోపాటు పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గిడ్డయ్యను హైవే అంబులెన్స్‌లో కర్నూల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు బస్ డ్రైవర్ మల్లేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## చెరువులో పడి వ్యక్తి, కాడెద్దులు మృతి

–నీళ్లు తాపేందుకు వెళ్లగా ఘటన

గోపాల్‌పేట, అక్టోబర్ 6 : చెరువులో నీళ్లు తాపేందుకు వెళ్లి కాడెద్దులతో సహ నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన రేవల్లి మండలం నాగపూర్‌లో చోటు చేసుకున్నది. ఎస్సై శివకుమార్ కథనం మేరకు.. నాగపూర్‌కు చెందిన గొర్ల నర్సింహ(63) శుక్రవారం బండి కాడెద్దులతోపాటు మరో రెండు ఎద్దులను బండికి వెనుక భాగంలో కట్టుకొని నీళ్లు తాపేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో చెరువు వద్దకు వెళ్లగానే ఎద్దులు బెదిరిపోయి బండితో సహా వెనుక ఉన్న ఎద్దులను నీళ్లలోకి ఈడ్చుకెళ్లాయి. వాటిని రక్షించేందుకు నర్సింహ లోపలికి వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. అదేవిధంగా బండికి వెనుక కట్టిన రెండెద్దులు కూడా బయటకు రాలేక మృతి చెందాయి. కాడికి కట్టిన ఎద్దులు మాత్రం ఈదుకుంటూ బండితో సహ బయటపడ్డాయి. గమనించిన చుట్టుపక్కల వారు గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నర్సింహ మృతదేహంతోపాటు రెండెద్దులను బయటకు తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఆయన తెలిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 6 : మండలంలోని నల్లవెల్లిలో పురుగుల మందు తాగి మిద్దె బంగారయ్య(42) శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగినట్లు గ్రామస్తులు తెలిపారు. భార్య నీలమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.